## భద్రాద్రి బ్యాంక్ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న చెరుకూరి కృష్ణమూర్తి

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 4: భద్రాద్రి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 28వ వార్షికోత్సవం శుక్రవారం నగరంలోని ప్రధాన కార్యాలయంలో జరిగింది. బ్యాంక్ పాలకవర్గ సభ్యులు, అధికారులతో కలిసి చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. ఆయన మాట్లాడుతూ.. ఖాతాదారుల నమ్మకమే ప్రమాణంగా సేవలు అందిస్తున్నామన్నారు. ప్రథమ శ్రేణి బ్యాంకుగా రిజర్వ్ బ్యాంకు గుర్తించిందని చెప్పారు. ప్రస్తుతం 17 బ్రాంచీలతో రూ.950 కోట్లకు పైగా టర్నోవర్‌తో తమ బ్యాంకు పురోగతిలో ఉందన్నారు. మరో ఐదు శాఖల ఏర్పాటుకు ఆర్‌బీఐ ఆమోదం తెలిపిందన్నారు. కార్యక్రమంలో సీఈవో దాసరి వేణుగోపాల్‌రావు, వైస్ చైర్మన్లు ఉదయ్ ప్రతాప్, వేములపల్లి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు సాంబమూర్తి, దేవత్ రాజారావు, కె.నర్మద, జయప్రద, మద్ది పిచ్చయ్య, శ్రీను, రేఖల భాస్కర్‌రావు, డీజీఎం ఎల్‌వీఎస్ ప్రసాద్, మేనేజర్లు శ్యాం, రామారావు, సత్యనారాయణ, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌వోసీలు అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎంపీ కార్యాలయ సిబ్బంది

ఖమ్మం, అక్టోబర్ 4: శస్త్ర చికిత్స చేయించుకునే స్థోమతు లేని ఇద్దరికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అండగా నిలిచారు. ములకలపల్లి మండలం వేపలగడ్డకు చెందిన వై.వెంకటేశ్వర్లుకు, కొణిజర్ల మండలం పెద్ద గోపతికి చెందిన బి.హారికకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2 లక్షల చొప్పున సాయం అందేలా లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ) తెప్పించారు. వీటిని వారిద్దరికీ ఆయన కార్యాలయ సిబ్బంది శుక్రవారం అందజేశారు.

## పుస్తక రూపంలో జిల్లా సమగ్ర స్వరూపం

ఖమ్మం, అక్టోబర్ 4: జిల్లా సమగ్ర స్వరూపాన్ని త్వరలోనే పుస్తక రూపంలో రానున్నది. ఇందుకోసం కోర్ కమిటీ ఏర్పాటైంది. దీనికి కన్వీనర్‌గా రచయిత్రి పురిమళ్ల సునంద వ్యవహరిస్తున్నారు. ఆమె ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఈ కమిటీ సభ్యులుగా సయ్యద్ షఫీ, నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్ ఉంటారని తెలిపారు. ఖమ్మం జిల్లా నైసర్గిక స్వరూపం, ప్రాచీన చరిత్ర, సంస్కృతి, జీవన విధానం, పర్యాటక ప్రదేశాలు, పురాతన దేవాలయాలు, సాగు–తాగు నీటి వనరులు, వ్యవసాయం–అనుబంధ పరిశ్రమలు, అడవులు, పారిశ్రామికీకరణ, విద్య, వైద్యం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో జిల్లా పాత్ర, జిల్లా అభివృద్ధిలో రాజకీయ నాయకుల పాత్ర, మహిళాభ్యుదయం, సాహిత్యాభివృద్ధి తదితర అంశాలపై ఈ పుస్తకంలో వ్యాసాలుంటాయని వివరించారు. పుస్తక రూపకల్పనలో భాగంగా త్వరలోనే జిల్లాలోని ప్రముఖులతో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు సునంద తెలిపారు.

## రేపు వినికిడి వైద్యపరీక్షల శిబిరం

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 4 : లయన్స్‌క్లబ్ సత్తుపల్లి ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన ఉదయం 9 గంటలకు ఉచిత వినికిడి వైద్య పరీక్షల శిబిరం నిర్వహిస్తున్నట్లు పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ దారా కృష్ణారావు తెలిపారు. శుక్రవారం స్థానిక కళాభారతి ఆడిటోరియం వద్ద నిర్వహించిన సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఏడీఐపీ చికిత్స కోసం పిల్లల డేటాఆఫ్‌బర్త్ సర్టిఫికెట్‌తోపాటు, తల్లిదండ్రుల ఆధార్‌కార్డులు, సదరం సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు, మెడికల్ రిపోర్ట్ జిరాక్స్‌లు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెనుగొండ రవేష్, దాసరి ఉమామహేశ్వరరెడ్డి, పీడీ శ్రీనివాస్‌రెడ్డి, అప్పారావు, మురళి, సోమిరెడ్డి, రవి, రమణ పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా టీఎన్‌జీవోస్ ఎన్నికలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

సత్తుపల్లి, అక్టోబర్ 4 : కల్లూరు టీఎన్‌జీవోస్ ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఈ యూనిట్ ఎన్నికలకు జీ.భాస్కర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో సింగిల్‌సెట్ నామినేషన్ దాఖలు కావడంతో కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా కొత్త పెద్దపుల్లయ్య, కార్యదర్శిగా విజయ్‌కుమార్, కోశాధికారిగా వెంకటరమణతోపాటు, మరో 12మంది సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కమిటీ పదవీకాలం మూడేళ్లపాటు కొనసాగుతుందని ఎన్నికల అధికారి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ కొనిదెల శ్రీనివాస్, సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు పొట్టపింజర రామయ్య, సభ్యులు జైపాల్, దుర్గాప్రసాద్, లలిత కుమారి పాల్గొన్నారు. నూతన కమిటీని జిల్లా కమిటీ సభ్యులు అభినందించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.

NT-331783-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## 'బీసీ'లో శిక్షణ.. డీఎస్సీకి ఎంపిక

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 4: నగరంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన వారిలో కొందరు డీఎస్సీకి ఎంపికైనట్లు డైరెక్టర్ జి.శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ కేటగిరిలో శిక్షణ పొందిన 259 మందిలో 62 మంది ఎంపికైనట్లు వివరించారు.

## అడ్మిషన్ల గడువు పొడిగింపు

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈవో సోమశేఖరశర్మ, కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 80084 03522 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616



ఎర్రుపాలెం: బాలత్రిపుర సుందరిగా అమ్మవారు



ఎర్రుపాలెం: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



వేంసూరు: అమ్మవారికి పూజలు



సత్తుపల్లి: గాయత్రీదేవిగా అమ్మవారు



పెనుబల్లి: మహిళల కుంకుమ పూజ

## కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు

ఖమ్మం జిల్లావ్యాప్తంగా శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలు శుక్రవారం కొనసాగాయి. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. మహిళలు కుంకుమపూజలు నిర్వహించారు. పలు దుర్గామాతా మండపాల వద్ద మహిళలు కోలాటం నిర్వహించారు.

– నమస్తే నెట్‌వర్క్



వైరాటౌన్: గాయత్రీదేవిగా అమ్మవారు



కారేపల్లి: అమ్మవారికి పూజలు



చింతకాని: గాయత్రీదేవిగా అమ్మవారు



మధిరలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఖమ్మంలోని 'త్రివేణి'లో..



చింతకాని : రామృష్ణాపురంలో..

## రంగులా పూలుదెచ్చి.. ప్రేమతో నిన్ను పేర్చి

జిల్లాలోని మహిళలు బతుకమ్మ సంబురాలను వాడవాడలా ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడోరోజూ ఆటపాటలతో ఉత్సాహంగా జరుపుకున్నారు. సాయంత్రం సమయంలో తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మలను ఒక్కచోట పేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ కోలాటాల నడుమ సందడి చేశారు. అనంతరం సమీపంలోని చెరువులు, కాలువలు, వాగుల్లో నిమజ్జనం చేశారు. ఖమ్మం నగరంలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో బతుకమ్మ వేడుకలు జరిగాయి. గీతాంజలి పాఠశాలలో డైరెక్టర్లు టీవీ అప్పారావు, టి.పద్మ, అరుణ్, త్రివేణి పాఠశాలలో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, టైనిటాట్స్ పాఠశాలలో కరస్పాండెంట్ శెట్టి భాస్కర్ పాల్గొన్నారు. – నమస్తే నెటవర్క్



ఖమ్మం బీఆర్‌ఎస్ కార్యాలయంలో..



సత్తుపల్లి : విశ్వశాంతి విద్యాలయంలో ..



బోనకల్లు : బతుకమ్మలు ఆడుతున్న మహిళలు





ఖమ్మం బీఆర్‌ఎస్ కార్యాలయంలో..

# విద్యతోనే పేదరిక నిర్మూలన : కలెక్టర్



కల్లూరులో షాదీఖాన పనులు పరిశీలించేందుకు ఎమ్మెల్యే రాయిమయితో కలిసి వెళ్తున్న కలెక్టర్

పెనుబల్లి, అక్టోబర్ 4 : విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన జరుగుతుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కల్లూరు పట్టణంలోని పెండింగ్‌లో ఉన్న షాదీఖానా నిర్మాణాన్ని ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను తల్లిదండ్రులు పరిశీలించాలని, వచ్చిన మార్కులను గమనించి పిల్లలను ప్రైవేటు బడులకు కాకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలలో చదివే పిల్లల తల్లులను భాగస్వామ్యం చేస్తూ మౌలిక వసతులు కల్పించామని పేర్కొన్నారు. అదేవిధంగా షాదీఖానా, కబరస్తాన్ వంటి మౌలిక వసతులు అందించడంతోపాటు, వాటి నిర్వహణ ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ షాదీఖానాను సాధ్యమైనంత త్వరగా ఆకర్షణీయంగా నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎల్.రాజేంద్రగౌడ్, తహసీల్దార్ పులి సాంబశివుడు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్‌విజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ, డిప్యూటీ తహసీల్దార్ జంగా బాబ్జిప్రసాద్, ఆర్‌ఐ సుజాత, సీడీపీవో నిర్మలాజ్యోతి, స్థానిక నాయకులు పసుమర్తి చంద్రరావు, మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో కుటుంబ డిజిటల్ కార్డు సర్వే



సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో



సర్వేను పరిశీలిస్తున్న సురేంద్ర మోహన్

మధిర, అక్టోబర్ 4 : కుటుంబ డిజిటల్ కార్డు సర్వేను ఖమ్మం ఆర్డీవో జీ.గణేష్ శుక్రవారం పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డును పైలెట్ ప్రాజెక్టు కింద గుర్తించారు. రెండోరోజు తహసీల్దార్ రాంబాబు, మున్సిపల్ కమిషనర్ షఫిఉల్లాతో కలిసి కుటుంబ డిజిటల్ సర్వేను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఖమ్మం ఆర్డీవో గణేష్ సర్వేలో కుటుంబ వివరాలను సేకరిస్తున్న అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వేలో ప్రతి కుటుంబ సభ్యుల వివరాలను సంబంధించిన ఆధారాలను సర్వేలో పొందుపర్చాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

### డిజిటల్ సర్వేకు ప్రజలు సహకరించాలి

పెనుబల్లి, అక్టోబర్ 4 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొదలుపెట్టిన కుటుంబ డిజిటల్ కార్డు సర్వేకు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ పులి సాంబశివుడు అన్నారు. మండల పరిధిలోని వాక్యానాయక్‌తండాలో జరుగుతున్న 4 టీంల సర్వేను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతిఒక్కరూ ఇంటి వద్ద ఉండి అధికారులకు పూర్తి వివరాలు వెల్లడించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ జంగం బాబ్జిప్రసాద్, ఆర్‌ఐ సుజాత, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, గ్రామస్థాయి సిబ్బంది, పాల్గొన్నారు.

### డిజిటల్ కార్డ్ సర్వే పరిశీలన

రఘునాథపాలెం, అక్టోబర్ 4: మండలంలోని రాములు తండాలో ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ సర్వేను జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్ర మోహన్ శుక్రవారం పర్యటించారు. సర్వే సిబ్బందికి సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సిహెచ్.స్వామి, ఎంపీడీవో అశోక్, ఎంపీవో శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

మధిర, అక్టోబర్ 4 : దళితులకు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మాద్దాల ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎస్సీకాలనీలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) 26వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక గ్రామకార్యదర్శి సిరపంగి కిరణ్ కేవీపీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, విల్సన్, నాని, నాగేశ్వరరావు, ఏసు, కుమారి పాల్గొన్నారు.

### 'బీజేపీ దేశానికి ప్రమాదకరం'

బోనకల్లు, అక్టోబర్ 4 : బీజేపీ మతోన్మాదుల పార్టీ అని, దేశానికి అత్యంత ప్రమాదకరమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం మండల పరిధిలోని తూటికుంట్లలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ లౌకిక రాజ్యాంగంగా ఉన్న మన దేశాన్ని బీజేపీ ప్రభుత్వం మతతత్వ విధానాలను అంటగడుతుందన్నారు. సెక్యూలర్ రాజ్యాంగం గల మనదేశంలో జమిలి ఎన్నికలు సాధ్యం కాదని పేర్కొన్నారు. కోటేశ్వరరావు, రామనర్సయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, పంతు, పుల్లయ్య, సౌభాగ్యం, ముత్తారావు పాల్గొన్నారు.

### ప్రజాసమస్యలను పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీకేఎంయూ నాయకులు

వేంసూరు, అక్టోబర్ 4 : పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించి వారిని ఆదుకోవాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం(బీకేఎంయూ) ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేసి తహసీల్దార్ ఎం.ఎ.రాజుకు వినతిపత్రం అందజేశారు. బీకేఎంయూ ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన విధంగా పేదలందరికీ సంవత్సరానికి 12 వేలు వెంటనే ఇవ్వాలని, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లతోపాటు, పెన్షన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్కే రంజాన్‌బీ, లాల్‌మొహమ్మద్, హమీద్, అజయ్, వ్యవసాయ కూలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధితోనే ప్రగతి

### మాజీ ఎమ్మెల్యే నంద్యాల



కుట్టుమిషన్ కేంద్రాన్ని ప్రారంభించిన నర్సింహారెడ్డి, నాగేశ్వరరావు

కూసుమంచి(నేలకొండపల్లి), అక్టోబర్ 4 : మహిళలు అన్నిరంగాల్లో ముందుకుపోవాలని, ముఖ్యంగా ఆర్థికంగా ఎదిగితేనే ప్రగతి సాధ్యమవుతుందని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి అన్నారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో మహిళల కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి దిశగా పాలకుల ఏర్పాట్లు జరగడం లేదన్నారు. కార్యక్రమంలో రచ్చా నర్సింహారావు, నున్నా నాగేశ్వరరావు బండి రమేశ్, మచ్చా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరిస్తే వెనుకబాటు

పెనుబల్లి, అక్టోబర్ 4 : అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరిస్తే రాష్ట్రం వెనుకబాటుకు గురవుతుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమల విఠల్‌రావు అన్నారు. శుక్రవారం ఉప్పలచిలక గ్రామంలోశాఖ మహాసభ మామిళ్ల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో విఠల్‌రావు మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో సంక్షేమం విస్మరిస్తే అసమానతలు పెరిగి సమాజంలో అలజడులు జరుగుతాయన్నారు. ఉప్పలచిలక నూతన కార్యదర్శిగా జొన్నలగడ్డ రమణయ్యను, సహాయ కార్యదర్శిగా కంటి నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. సత్యం, చిరంజీవి, నాగేశ్వరరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

## చికిత్సపొందుతూ వివాహిత మృతి

ఖమ్మం రూరల్, అక్టోబర్ 4 : పురుగుల మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. ఖమ్మంరూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తగూడెం గ్రామ పరిధిలోని ఎస్‌వీఆర్ నగర్‌లో బాగం వాణి(55) కుటుంబం నివాసముంటోంది. గత కొన్ని సంవత్సరాలుగా వాణికి మానసిక స్థితి బాగ లేకపోవడంతో చికిత్స అందిస్తూ వస్తున్నారు. ఈక్రమంలో ఈ నెల 2వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగింది. సాయంత్రం ఇంటికొచ్చిన భర్త గమనించి కుమారుడు రాజగోపాల్ సహాయంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకవెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ వాణి శుక్రవారం మృతిచెందింది. రాజగోపాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## యువకుడి ఆత్మహత్య

ముదిగొండ, అక్టోబర్ 4 : చదువు పూర్తై రెండేళ్లు అయినా ఉద్యోగం రావడం లేదని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ముదిగొండకు చెందిన ఉప్పు నాగప్రణిత్(23) డిగ్రీ పూర్తి చేసి రెండేళ్లుగా ఉద్యోగం కోసం కోచింగ్ తీసుకుంటున్నాడు. ఎంత ప్రయత్నించినా ఏ ఉద్యోగం రావడం లేదని బాధ పడుతున్నాడు. ఈక్రమంలో గత నెల 28వ తేదీన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. వెంటనే గమనించిన కుటుంబసభ్యులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళి తెలిపారు.

## వ్యాపారిపై కత్తితో దాడి

### అడ్డు వచ్చిన భార్యకు తీవ్రగాయాలు

కొణిజర్ల, అక్టోబర్ 4 : వ్యాపారిపై ఓ ఎంపీటీసీ కొబ్బరికాయల కత్తితో దాడికి దిగిన ఘటన మండలంలోని తనికెళ్లలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన ప్రకారం.. తనికెళ్ల గ్రామానికి చెందిన కావేటి రామకృష్ణతోపాటు, అతడి భార్య ఉదయలక్ష్మి తనికెళ్ల నుంచి తుమ్మలపల్లి వెళ్లే క్రాస్‌రోడ్డు వద్ద మిఠాయి దుకాణాన్ని నెలరోజుల క్రితం ప్రారంభించారు. అయితే వీరి దుకాణానికి అడ్డుగా మల్లెపూల వ్యాపారి నాలుగు చక్రాల బండిని పెడుతున్నాడు. దీంతో తమ షాపునకు అడ్డుగా బండి నిలపవద్దని మల్లెపూల వ్యాపారిని రామకృష్ణ వారించాడు. ఆ మల్లెపూల వ్యాపారి ఎంపీటీసీ గుండ్ల కోటేశ్వరరావుకు చెప్పడంతో సదరు ఎంపీటీసీ స్వీట్‌షాపు యజమాని రామకృష్ణపై కొబ్బరికాయల కత్తితో దాడికి పాల్పడ్డాడు. భార్య ఉదయలక్ష్మి అడ్డురావడంతో ఆమె కుడి చేయి చూపుడు వేలుకు కత్తి తగిలి తీవ్ర రక్తస్రావమైంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూలవ్యాపారి సైతం తన పూలబండిని స్వీట్‌షాపు యజమాని ధ్వంసం చేశాడంటూ ఫిర్యాదు చేశాడు.

## టీడీపీ సీనియర్ నాయకుడు మృతి

కొణిజర్ల, అక్టోబర్ 4 : మండల పరిధిలోని పెద్దమునగాల గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు చింతల మల్లయ్య(70) శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. ఆయన భౌతికకాయాన్ని టీడీపీ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సుధాకర్‌రావు, మురళి, శ్రీనివాసరావు, ఆంజనేయులు, భాస్కర్‌రావు తదితరులు ఉన్నారు.

## వంద ఎకరాల్లో వరికి నష్టం

కూసుమంచి, అక్టోబర్ 4 : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి పడిన వర్షానికి వంద ఎకరాల్లో చేతికి వచ్చిన వరి నేలపాలైంది. గుర్వాయిగూడెం, జుజ్జుల్‌రావుపేట, పెరికసింగారం, గట్టుసింగారం, జక్కేపల్లి గ్రామాల్లో రైతులకు నష్టం వాటిల్లింది. పంట నష్టాలను ఏడీఏ సరిత, ఏఓ వాణి పరిశీలించారు. మరో 20 నుంచి 30 రోజుల్లో చేతికి అందే పంట ఈదురుగాలులకు పూర్తిగా నేలమట్టమైంది.

## వ్యక్తిపై కేసు నమోదు

ఎర్రుపాలెం, అక్టోబర్ 4 : మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామానికి చెందిన అన్నెం రాంబాబు, తుపాకుల శంకర్‌రావు మధ్య గత కొంతకాలంగా భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం సైతం ఇరువురు ఆ భూమి విషయంలో ఘర్షణ పడ్డారు. శంకర్‌రావు తలకు గాయాలుకావడంతో పోలీస్‌స్టేషన్‌లో రాంబాబుపై ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

## పీడీఎస్‌యూ ర్యాలీ



నాగులవంచలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

చింతకాని, అక్టోబర్ 4 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాగులవంచ గ్రామంలో పీడీఎస్‌యూ మండల కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు జీ మస్తాన్ మాట్లాడుతూ విద్యారంగానికి బడ్జెట్‌లో కేటాయించిన నిధులను పూర్తిగా వినియోగించాలని కోరారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ నెల 21వ తేదీన ఖమ్మం నగరంలో పీడీఎస్‌యూ అర్ధశతాబ్ది జిల్లా స్థాయి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మణికంఠ, శివ, సాయి, వర్ధన్, గోపీ పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థినికి సాయం

వైరాటౌన్, అక్టోబర్ 4 : నిరుపేద విద్యార్థినికి మోక్షిత నిధి ఫౌండేషన్ వారు మోక్షిత నిధి కోచింగ్ సెంటర్‌లో సంస్థ చైర్మన్ శ్రీరామోజి ఉప్పలచారి ఆధ్వర్యంలో శుక్రవారం రూ.15 వేలు ఆర్థికసాయం అందించారు. వైరా పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు తిరుమలదాసు రమేష్ కుమార్తె రజిత బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నది. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ గని, విజయరావు బాల్య పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఓపెన్ పరీక్షలు

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 4: ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు రెండోరోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. టెన్త్‌లో 256 మందికిగాను 222 మంది, ఇంటర్‌లో 83మందికి 68 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తనిఖీ చేశారు.